# సీసాలు

ఇద్దరు కవులు కూర్చుని సాహిత్యంమీద మాట్లాడుకుంటున్నారు. కవిత్వం, రచనా వ్యాసంగం ఎన్ని పిచ్చివేషాలు వేస్తుందో చెప్పుకుంటూ ఇద్దరూ తెగ బాధపడిపోతున్నారు.

ఈ లోగా అప్పుడే సాహితీ వ్యాసంగం లోకి దిగిన యువకుడు వచ్చి వాళ్ళిద్దరి మధ్యనా కూర్చున్నాడు. వాళ్ళిద్దరిలో ఒకరికి ఆ యువకుడు శిష్యుడు.

"సూర్యశ్రీగారూ! ఇంకా ఎన్ని సీసాలు మిగిలాయి? త్వరగా మీ కార్యక్రమం పూర్తి చేయండి."

"..... ..... ..... ..... ....."

పద్మశ్రీ అనబడే కవిగారు వేసిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా కూర్చున్నారు సూర్యశ్రీగారు.

ఈలోగా కూర్చున్న యువకుడికి ఏదో ఆలోచన వచ్చింది.

"గురూగారూ! మా ఇంట్లో చాలా సీసాలు వున్నాయి. తెచ్చి ఇస్తాను. తమ కార్యక్రమం పూర్తిచెయ్యండి" అన్నాడు ఆ యువకుడు.

దానికి సూర్యశ్రీగారు "ఏమిటిబాబూ ఎన్ని సీసాలు ఇస్తావు?" అన్నారు.

"ఎన్ని కావాలంటే అన్ని ఇస్తాను. ఇప్పుడు అందరూ ఇంజక్షన్ సీసాలతో తాజ్ మహల్ తయారుచేస్తున్నారు కదా?"

దానికి ఆ యువకుడి గురువుగారు పద్మశ్రీ నవ్వుతూ—

"అదిగాదయ్యా మహాశయా! ఆయన సీస పద్యాలతో కావ్యం రాస్తున్నారు. ఇంకా ఎన్ని మిగిలాయని నేను అడుగుతున్నాను" అన్నారు.

"నాకు కొద్దిగా పని ఉంది గురువుగారూ!" అంటూ చకచకా వెళ్ళిపోయాడా యువకుడు.

—o—